# ముచ్చటైన మూడు నన్నయ కవితా లక్షణాలు

**డా. హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.**

**ప్రారంభం :** నన్నయ పదకొండవ శతాబ్దానికి చెందిన కవి. ఇతను చాళుక్య ప్రభువైనా రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి కుల బ్రాహ్మణుడు. రాజరాజ నరేంద్రుని కోరికపై సనాతన ధర్మ పునరుద్ధరణకై, భారతీయ సంస్కృతీ సముద్దీపనకై వ్యాసుడు రచించిన సంస్కృత భారతాన్ని నన్నయ ఆంధ్రీకరించాడు. నన్నయ వ్యాస భారతంలోని పద్దెనిమిది పర్వాలలో, ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలోని చతుర్థాశ్వాసంలో నూట నలుపై రెండవ పద్యం వరకు అనువాదం చేశాడు. ఇతనికి ఆదికవి, వాగనుశాసనుడు అను బిరుదులు ఉన్నాయి. వీరి రచనలు, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండిక విలాసము, ఇంద్రవిజయము, లక్షణసారము, రాఘవాభ్యుదములు.

**నారాయణభట్టు :** నన్నయకు భారత రచనలో తోడ్పడిన నారాయణభట్టు.

ఉదా॥ **పాయక పాకశానికి భారత ఘోర రణంబునందు నా**
**రాయణునట్లు వాసిగ ధరా మరవంశ విభూషణుండు నా**
**రాయణబట్టు వాఙ్మయధరంధరుడుం దనకిష్టుడున్ సహా**
**ధ్యాయుడు నైనవాడ భిమత స్థితిదొడయి నిర్వహింపగన్''**

అని కృతజ్ఞతా పూర్వకంగా స్మరించినాడు.

ఇక్కడ నారాయణభట్టు తనకు చేసిన సహాయాన్ని, భరత యుద్ధంలో శ్రీకృష్ణుడు అర్జునునికి చేసిన సహాయంలో పోల్చటంలో ఒక విశేషం కన్పిస్తుంది. భారతయుద్ధంలో శ్రీకృష్ణుడు అర్జునుని మొదటి నుంచి చివరి వరకూ వదలలేదు. అట్లాగే నారాయణభట్టు కూడా నన్నయకు భారతరచనలో సహాయం చేసి ఉంటాడని ''పాయక'' అన్న శబ్దాన్ని బట్టి ఊహించవచ్చు. భారతంలో కృష్ణుడు ''ఊరక నిరాయుధ వ్యాపారితమై నుండవాడ పరమాప్తుడవై'' అని చెప్పాడు. ఆ విధంగానే ఆయుధం పట్టకపోయినా పరమాప్తుడుగా ఉండి భారతాయుధం చేయించాడు. అట్లాగే నారాయణభట్టు కూడా నన్నయను నిరంతరం అనుసరించి ఉండుటయే ఆంధ్రీకరణ మహోద్యమాన్ని పూర్తి చేయించడానికి భావించవచ్చును. అందుచేతనే నన్నయ ఆయన సహాయాన్ని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించాడని చెప్పవచ్చును.

**నన్నయ అనువాద పద్ధతి :** నన్నయ సందర్భాన్నిబట్టి కాలానికి అనుగుణంగా ప్రజలు అందరు సులభంగా చదువుకోవడానికి, విని ఆనందించడానికి, అందరికి ఉపయోగపడే విధంగా ఔచిత్యంతో అనేక మార్పులు చేర్పులు చేస్తూ తెలుగులో అనువాదం చేసినా గొప్ప ధారశుద్ధిగల వాడు.

**నాటి పరిస్థితులు :** రాజరాజ నరేంద్రుడు 1019లో వేంగిదేశాన్ని పరిపాలించాడు. అయితే తన సవతి సోదరుడైన విజయాదిత్యుడి నుంచి నిత్యం దాడులు ఎదుర్కోవల్సి వచ్చింది. దానితో దాదాపు మూడు నుండి నాలుగు దశాబ్దాల పాటు రాజరాజ నరేంద్రుడి వేంగి రాజ్యంలో శాంతి భద్రతలు కరవయ్యాయి. కాని క్రీ.శ. 1054లో గాని సుస్థిరపాలనకు వాతావరణం ఏర్పడలేదు. తాను స్థిమితంగా సుస్థిరంగా పాలించిన సంవత్సరం క్రీ.శ. 1054 నుండి 1061 మధ్య కాలంలోనే నన్నయ చేత గంటం పట్టించి రాజరాజు భారత రచన చేయించాడు.

**మత పునరుద్ధరణ** : సాంఘికంగా నైతిక వ్యవస్థ బలహీనమైన ఆ పరిస్థితుల్లో సామాజిక క్రమశిక్షణను పునరుద్ధరించ వలసిన అవశ్యకతను రాజరాజ నరేంద్రుడు గుర్తించాడు. అందుకే గృహస్థ ధర్మాన్ని, వర్ణాశ్రమ ధర్మాలను ప్రబోధించే భారతాన్ని నన్నయ చేత రాజరాజ నరేంద్రుడు నాటి మత పరిస్థితులను ఔషధంగా రచింప చేశాడు.

**అవతారిక** : ఒక కావ్య రచనకు ముందు రాసే పరిచయ పీఠిక లాంటిది అవతారిక. కవి ఏయే పరిస్థితుల్లో, ఏయే ప్రేరణలతో, ఏయే ప్రయోజనాలతో ఒక కావ్యాన్ని రచిస్తున్నాడో వివరించే కావ్యారంభ భాగమే అవతారిక అని అంటారు. ఒక ప్రార్థనా శ్లోకం మాత్రమే కావ్యాదిలో రాస్తారు. కాని ఒక కావ్యాన్ని రాయడానికి గల నేపథ్యన్ని ప్రేరణను పోషకులను ప్రస్తావించడం, ఇష్టమైన దేవత ప్రార్థన తనకు పూర్వ కవులను స్తుతించడం, తన కవితా లక్షణాలను నిర్దేశించడం, సమకాలిన కవివృషభులను స్మరించడం లాంటి అంశాలతో విపులంగా అవతారికను రచించడం తెలుగులో ఆదికవి నన్నయతో ప్రారంభమైనది. నన్నయ అనంతర కవులు సైతం నన్నయ మార్గంలోనే నడిచారు. ఈ సంప్రదాయాన్ని నన్నయ కన్నడ కావ్యాల నుండి స్వీకరించాడు. ‘‘అవతారయతీత అవతారికా’’ అన్నారు. దీని అర్థం ఏమిటంటే ‘‘దిగునటు’’ అంటే కథలోకి దింపునట్లు చేసేది అవతారిక. ‘కావ్యం’ లోకి పఠిత ప్రవేశించడానికి పూర్వం ఒక నేపథ్యంగా, భూమికగా కవిరాసే స్తుతి రూపకమైన రచనే అవతారిక అన్నమాట.

**అవతారిక లక్షణాలు** : ఆంధ్ర విమర్శకులు నన్నయాది కవుల కావ్యావతారికలను పరిశీలించి వాటి అన్నిటిలోనూ ఉన్న సామాన్య లక్షణాలను గుర్తించి అవతారిక లక్షణాలుగా పెర్కొన్నారు. అవి.

1. మంగళ శ్లోకంతో ప్రారంభం కావాలి. 2. కృతిపతి వర్ణన ఉండాలి. 3. కావ్యకర్త (కవి) స్వీయవృత్తాంత వివరణ ఉండాలి. 4. కావ్య రచనా హేతువులు ఉండాలి. 5. ఇష్టదేవతాస్తుతి ఉండాలి. 6. పూర్వకవిస్తుతి ఉండాలి. 7. కవితా లక్షణాలు నిర్దేశన ఉండాలి. 8. షష్ఠాంత పద్యాలు ఉండాలి. 9. కుకవినింద ఉండాలి.

“సర్వేజనాస్సుఖినోభవంతు’’ అంటూ అందరి శుభాన్ని ఆశాసిస్తూ రచించేదే మంగళశ్లోకం. దీన్ని ‘శ్రీ’ కారంతో ప్రారంభిస్తారు. మూడు గురువులు ఉండే ‘‘మ’’ గణంతో దీన్ని మొదలు పెడతారు. దీన్ని చంద్ర నామాంకితం చేస్తారు. ‘‘ఆశీర్నమస్క్రియా వస్తునిర్దోశోవాపి తన్మఖమ్’’ ప్రకారం మంగళ శ్లోకంలో ఆశీర్వచనం, నమస్కారం, వస్తు నిర్దేశన ఉండాలి. నన్నయ అవతారికలో షష్ఠాంతపద్యాలు, కుకవినింద లేవు. వీటిని నన్నెచోడాది కవులు ప్రారంభించారని అంటారు. షష్ఠీ విభక్తి ప్రత్యయాలతో (కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్) ముగిస్తూ రాసేవే షష్ఠాంత పద్యాలు. చెడ్డకవులను నిందిస్తూ, దుష్టకావ్యాలను విమర్శిస్తూ కవి రచించే పద్యాలు కుకవి నింద పద్యాలు. నన్నయ ‘‘శ్రీవాణి గిరిజాశ్చిరాయ’’ అనే మంగళ శ్లోకంతో ప్రారంభించి ‘‘సారమతిం గవీంద్రులు’’ అనే పద్యం వరకు దాదాపు ఇరువై ఆరు పద్యాలలో అవతారికలో వివరంగా సంక్షిప్తంగా అందరికీ అర్థమయ్యే రీతిలో చక్కగా విపులంగా రచించాడు.

**నన్నయ కవితా లక్షణాలు** : నన్నయ ఈ కింది పద్యంలో ముచ్చటైన మూడు గుణాలతో కూడిన కవితా లక్షణాలను స్పష్టంగా భారతంలో తానే వివరించి వర్ణించాడు తెలుసుకుందాం!

**ఉ॥ ‘‘సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో**
**నారసి, మేలు నా నితరులక్షర రమ్యత నాదరింప నా**
**నా రుచిరార్థ సూక్తినిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా**
**భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్**’’ అని చెప్పాడు.

నన్నయ తను రాసిన రచనలో ప్రసన్నంతో కూడుకున్న కథాకలితార్థ యుక్తి ఉంది. నానారుచిరార్థ సూక్తి నిధిత్వం ఉంది. సారమతులైన 'కవిశ్రేష్ఠు'లు గల వారు ఉన్నారు. లోనారసి మేలుమేలని మెచ్చుకొనే విధంగా మొదలగు వారు ఉన్నారు. ఆ తర్వాత వారు అక్షర రమ్యతను మెచ్చుకొనేటట్లు, దేశ ప్రజల ఆకాంక్ష, శ్రేయస్సును కోరి, వర్తమానమే గాకుండా ముందు చూపుతో రాబోయే కాలాన్ని సమయ స్ఫూర్తితో అంచనావేసి భారతాన్ని రాయడానికి పూనుకున్నాడు. నన్నయ కవితా లక్షణాలు : 1. ప్రసన్న కథాకలితార్థయుక్తి, 2. నానారుచిరార్థ సూక్తినిధిత్వం, 3. అక్షర రమ్యత.

1. **ప్రసన్న కథాకలితార్థ యుక్తి :** అనగా నిర్మలమైన, స్పష్టమైన, స్వచ్ఛమైన మొదలయిన అర్థాలతో కూడిన కథలను అందించాడు. నన్నయ తాను చెప్పిన కథలో విషయాన్ని అస్పష్టత లేకుండా అనవసరం అనుకున్నా వాటిని ప్రజలకు ఉపయోగపడని కథలను భారతంలో ఎక్కడా తీసుకోలేదు. రాబోయే తరాన్ని దృష్టిలో బెట్టుకొని సందర్భానుసారంగా, కాలానుగుణంగా, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని వాటిని పాటించే విధంగా అనేక రకాలైనా కథలను అందించాడు.

ఆదికవి నన్నయ ఉత్తమమైన బుద్ధితో కూడిన లక్షణం కలవాడు. పాఠకులు ఎలాంటి కథలు చదువుతారు? వీళ్ళకు ఎలాంటి కథలు ఉపయోకరంగా ఉంటాయి? అని గ్రహించి లోతుగా వెళ్ళి ఆలోచించి జీవితంలో ఉపయోగపడాలని కోకొల్లలుగా కథలు భారతంలో రాశాడు. ప్రసన్న కథాకలితార్థయుక్తి అనేది కావ్య అంతః సౌందర్యానికి చెందినదని వివరించాడు.

కథను ప్రసన్నంగా చెప్పడం నన్నయకు బాగా ఇష్టం. శకుంతల చేత నిండు రాజసభలో నన్నయ ధర్మోపన్యాసం చేయించాడు. భార్యకు పుత్రునకు సత్య వాక్యానికి గల ప్రాశస్త్యాన్ని వేద ప్రమాణంతో శకుంతలచే చెప్పించాడు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం ఎంత తప్పో, శకుంతలచే చెప్పించాడు. ఎన్ని చెప్పినా, తనకు శకుంత తెలియదన్న దుష్యంతుడు తప్పు చేసినట్లే. అందుకే ఆకాశవాణి సత్యాన్ని చెప్పిన తర్వాత తాను లోకోపవాద భీతిచే అలా మాట్లాడానని దుష్యంతుడు తన తప్పును అంగీకరించాడు.

శకుంతల చెప్పవలసినది అంతా చెప్పినా, రాజు అంగీకరించలేదు. ఇంకా దేవుడే తనకు దిక్కు అని శకుంతలచే ఆదికవి నన్నయ చెప్పించాడు. "అన్యధా శరణం నాస్తి" అన్నప్పుడే, దైవం తోడ్పడుతుందని, ఆకాశవాణి మాటలచే సూచించాడు. భారతంలోని ఆదిపర్వం చతుర్థాశ్వాసం శకుంతలోపాఖ్యానం అనే పద్య భాగంలో ఈ విధంగా కథా కథనంలో నన్నయ ప్రసన్న కథా రచన సాగించాడు.

2. **అక్షర రమ్యత :** అనగా క్షరం అంటే నాశనం అని అర్థం. అక్షరం అనగా నాశనం కాని సౌందర్యం అని అర్థం. కొన్ని తరాలు, యుగాలుగా తరగని గనిలా సాగే కవితా శక్తి గలది. అంతేగాక అక్షరం సముచిత వర్ణ విన్యాసం, పదప్రయోగం, సమాస విరూపం, పాదదీర్ఘత, పద్యరచన వల్ల కలిగే నాదసౌందర్యం అని తెలియపర్చాడు నన్నయ.

మొక్కవోని ఆస్వాదమాధుర్యం ఈ లక్షణం వల్ల కావ్యానికి సిద్ధిస్తాయి. "భారత వాగమృతంబు కర్ణ రంధ్రంబును నంజనిం దనివిద్రావుదురని" అని నన్నయ తన నోటి ద్వారా పలికాడు. భారత వాక్కు అనే అమృతాన్ని పాఠకుడు తన మనస్సులో, హృదయంలో తనివితీరా ఆస్వాధించేందుకు అక్షర రమ్యత ఉపకరిస్తుందని పేర్కొన్నాడు.

కుంతకుడు అక్షరరమ్యతకు గురించి చెప్పిన మాట "వర్ణవిన్యాసం వక్రత" తో లయాన్వితం, ఆపాతమధురం, శ్రవణ శుభగత్వం, నన్నయ కవిత్వం అర్థం తెలియకపోయినా, ఏదో తెలీని శబ్ద సౌందర్యం, సామాన్య ప్రజలకు వీనుల విందు చేస్తుందని చెప్పాడు.

పండిత కవులు, పామరులు మరియు సామాన్యులు బాగా మనస్సుకు హత్తుకొనే విధంగా తమ ఎదలో గ్రహించేది "అక్షర రమ్యత". ఇది కావ్య బాహ్య సౌందర్యాన్ని దీపింప చేస్తుందని వర్ణించాడు.

సందర్భాన్ని అనుసరించి వర్ణించడమే పదగుంపనకు సంబంధించిందే గాక, రమణీయార్థ ప్రతిపాదనకు సంబంధించింది కావడం విశేషంగా భావించవచ్చు. అందువల్ల అది అక్షరమైనది.

అక్షర రమ్యతను పండితులేగాక, సామాన్య ప్రజలు కూడా ఆదరించి అభిమానిస్తారని నన్నయ భావించాడు. కొన్ని ఉదాహరణలు.

కం॥ "**సతియును గుణవతియు ప్రజా**
**వతియు ననుప్రతయునైన వనిత నవజ్ఞా**
**న్వితి దృష్టి జూచు నతి దు**
**ర్మతి కిహముం బరము కలదె మతి పరికింపన్**" (భారతం - ఆదిపర్వం, చతుర్థాశ్వాసం)

అను ప్రాస శ్రవణ మనోహరంగా ఉంది. బుద్ధితో బాగా పరిశీలిస్తే, పతివ్రతయూ, గుణవతియూ, సంతాన వతియూ అనుకూలవతియునైన భార్యను, తిరస్కార దృష్టితో చూసే దుర్మార్గుడికి, ఇహపరలోక సుఖాలు, రెండు ఉండవు (అనగా అతడు రెంటికీ చెడిన రేవడు అవుతాడని భావం)

మరొక ఉదా॥ "**విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్రగా**
**త్రపరిష్వంగ సుఖంబు సేకొనుము ముక్తాహారకర్పూరసాం**
**ద్రపరాగ ప్రసరంబు చందనము చంద్రజ్యోత్స్నయుం బుత్రగా**
**త్రపరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే**"
(భారతం - ఆదిపర్వం, చతుర్థాశ్వాసం)

ఓ రాజా! విరుద్ధములైన మారు మాటలు ఎందుకు? ఈ పుత్రుడిని కౌగిలించుకొని, ఈతడి కౌగిలి వల్ల కలిగే సుఖాన్ని అనుభవించు ముత్యాల హారాలూ, పచ్చకర్పూరపు దట్టమైన పొడిని పూయడమూ, మంచి గంధమునూ, వెన్నెలయూ, ప్రాణులకు పుత్రుని కౌగిలివలె, మనస్సుకు సుఖాన్ని, మంచి చల్లదనాన్ని కల్గించలేవు.

పై పద్యంలో విశేషం ఏమిటంటే స్పర్శ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఈ పద్యం, నన్నయగారి మధురమైన కవిత్వానికి చక్కని ఉదాహరణ, తెలుగు సాహిత్యంలో బాగా ప్రసిద్ధి చెందిన నన్నయ పద్యాలలో ఇది చాల మేలైనది.

ఇందులో నన్నయ చెప్పిన ఉపమానాలన్నీ వ్యాస భారతంలో లేనట్టివే. కుమారుని ప్రాశస్త్యం ఇందులో చెప్పబడింది. పద్యం రసవంతమైన శైలిలో సమాస బంధురంగా సాగింది.

ఈ విధంగా భారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో నన్నయ కవితాలను శకుంతలోపాఖ్యాన కథలో చక్కగా దర్శనమిస్తున్నాయి.

**3. నానారుచిరార్థ సూక్తి నిధిత్వము :** సూక్తి అంటే రుచిరమై చమత్కార యుక్తమైన మార్పు అని "ఖండవల్లి అక్ష్మీరంజనం" చెప్పాడు. ఒక్కోపదంలో పదబంధంలో, సమాసంలో, కారకంలో, వాక్యంలో బహుబంగుల్లో ఈ మార్పు ఉంటుందని ఆతను వివరించాడు.

'సూక్తి నిధి'ని నన్నయ తాను వ్యక్తిత్వ విశేషం అని స్వయంగా చెప్పాడు .దీన్ని విమర్శకులు ఆయన కవితా విశేషంగా అనువర్తింప చేశారు. నన్నయ అనేక కాంతివంతమైనటువంటి అర్థవంతమైనటువంటి సూక్తులకు నిధి లాంటి వాడు. ఇతడి మూడు కవితా లక్షణాలలో తొలి రెండు కవితా శైలికి సంబంధించినవి కాగా మరొకటి వస్తువుకు సంబంధించింది. లోకాన్ని దృష్టిలో బెట్టుకొని, వాళ్ళకు ఉపయోగపడే విధంగా సుభాషితాలను

విడదీసి సందర్భోచితంగా తన కావ్యాలలో రచన చేస్తాడు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆదికవి నన్నయ సార్వజనీన, సార్వదేశీయ, సార్వకాలిక వంటి గొప్ప సత్యాలు కలిగి ఉన్నటువంటి సూక్తులను నిలబెట్టాడు.

నన్నయ మరొక లక్షణంగా భావించే వారి పద్య లక్షణం ‘‘సంహితా రచన బంధురుడయ్యె’’. విశిష్ట పదరచన గల వైదర్భి మొదలైన రీతులతో కూడిన పద వృత్త్య సహిష్ణుమైన పదరచనా రూపమైన శయ్య రచన బంధురత్వం. నన్నయ భారతంలో ఆదిపర్వం చతుర్థాశ్వాసం శకుంతలోపాఖ్యానంలో వివిధ సందర్భాలలో శకుంతల నోటి ద్వారా అనేక సూక్తులను చెప్పించారు.

**“ఏల యెఱుక లేని యితరుల యట్ల నీ**
**వేఱుక ననుచు పలికె దెఱిగి యెఱిగి**
**యేన కాని దేని నెఱుంగ రిందొరు లని**
**తప్పబలుక నగునే ధార్మికులకు’’**

శకుంతల నోట అన్న మాటలు అన్నీ బాగా తెలిసి కూడా తెలియదని, ఎవరో తెలివిలేని ఇతరులవలె, ఎందుకు మాట్లాడుతున్నావు? ఇక్కడ దీనిని నేనే కాని ఇతరులు ఎవ్వరూ ఎరుగరని (అనగా సాక్షులు లేరని), ధర్మాత్ములైన నీ వంటి వారు అబద్ధం మాట్లాడవచ్చునా (అబద్ధం మాట్లాడరాదని భావం).

మరొక ఉదా॥ **నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత**
**వ్రత యొకబావి మేలు మఱి బావులు నూఱిటికంటె నొక్క స**
**త్క్రతు వది మేలు తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు త**
**త్సుత శతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్**

పై పద్యంలో సత్యవాక్యం యొక్క విశిష్టతను, శకుంతల దుష్యంతుడికి తెల్పుతున్న సందర్భం. సత్యవ్రతం గల ఓ మహారాజా! మంచి నీటితో నిండిన చేదుడు భావులు నూరింటి కంటె, ఒక దిగుడు బావి మేలు, అట్టి బావులు నూరింటి కంటె ఒక మంచి యజ్ఞం మేలు, అటువంటి నూరు యజ్ఞాలకంటె, ఒక పుత్రుడు మేలు, అట్టి పుత్రుడు వందమంది కంటె, ఒక సత్యవాక్యం మేలు అనే నీతిని బోధించింది శకుంతల.

అందులోను విశేషములు కూడా వారికి అర్థమయ్యే రీతిలో వివరించి చెప్పింది. అది ఏమిటంటే ‘‘సూనృతవ్రత’’ అనేది సాభిప్రాయ విశేషణం. మాట తప్పిన దుష్యంతుడిని, ఎత్తి పొడవడానికి శకుంతల వాడిన సంబోధన మిది. సత్యం మాట్లాడటం, నీకు వ్రతం కాబట్టి, నిజాన్ని ఒప్పుకోమని చెప్పినట్లైంది. ఈ పద్యంలో సత్యవాక్య మహిమను, శకుంతల చక్కగా విడమరిచి చెప్పింది.

నూరు నూతులు (తవ్వించడం కన్న) బావి తవ్వించడం వల్ల మంచి పుణ్యం వస్తుందట. నూరు బావులు తవ్వించడం కంటే, యజ్ఞం వల్ల ఫలితం ఎక్కువగా ఉంటుందట. నూరు యజ్ఞాల కంటె, ఒక కుమారుడిని కనడం ఉత్తమం. నూర్గురి పుత్రుల కన్నా, సత్యవాక్యం పలకడం ఉత్తమం అని చెప్పి, సత్యవాక్య ప్రాశస్త్యాన్ని శకుంతల దుష్యంతుడికి మరీ గుర్తు చేసింది. నన్నయ రుచిరార్థ సూక్తులలో ఇది చాల మేలైనది అని భావించాడు.

“ధర్మంబుల కెల్ల పెద్దయండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన’’ మునులు ఇటువంటి సూక్తి రత్నాలు, శకుంతలోపాఖ్యానంలో అనేకం ఉన్నాయి. నిజానికి నన్నయ శకుంతల నోట అనర్ఘ రత్నాల వంటి సూక్తులను చెప్పించాడు.

శ్రీనాథుడు భాషింతు నన్నయభట్టు మార్గంబున ఉభయ వాక్ప్రౌఢని ఒక్కొక్క మాటు అని పలికాడు. దీని ఆధారంగా నన్నయ కవితా లక్షణంగా ఉభయ వాక్ప్రౌఢని విమర్శకులు గుర్తించారు.

సంస్కృత ఆంధ్ర ఉభయ భాషల్లోని వాక్కుల ప్రౌఢిమను ప్రదర్శించే నేర్పు ఇది. తత్సమ దేశ్య పద సంయోజనంతో నన్నయ కవిత సాగుతుంది. పఠితకు సుపరిచితమైన సంస్కృతాంధ్ర పదప్రయోగం చెస్తాడు నన్నయ.

అంతేగాక నన్నయ మూడు కవితా లక్షణాలు లోకహితమును కోరి రాశాడని ఇందులో

1. కవీంద్రులు మాత్రమే మేలని మెచ్చుకోదగిందని
2. కవీంద్రులే గాక తెలుగు భాష పట్ల అభిమానమున్న వారంతా మొచ్చుకునేది.
3. నన్నయ కవితకు జీవలక్షణమైందని చెప్పుతూనే ఆ గ్రంథం భారతమనే పంచమ వేదం, అది జగత్కల్యాణమైందని ‘‘ఆంధ్రకావ్యాలు ‘‘ఆణిముత్యాలు’’ అనే గ్రంథంలో వివరించారు.

**కావ్యదృష్టి :** నన్నయది ప్రధానంగా కావ్యదృష్టిగా కనిపిస్తుంది. అంటే మూలంలోని ముఖ్య సన్నివేశాలను విడవకుండా, రసపోషణ వర్ణనాదులతో రచించిడం. అతని దృష్టిలో కథ ప్రధానం. అందువల్ల ఆయనది మూలానికి యథోచితానువాదమే గాని, యథాతథానువాదం కాదు అని తెలియపర్చారు. కాబట్టి మూలంలోని దాదాపు పదిహేడు వేల శ్లోకాలు, నన్నయ భారతంలో నాలుగు వేలకు దిగాయి. అంటే గ్రంథం నాలుగవ వంతుకు సంక్షిప్తీకరించారని తెలుస్తుంది.

**మరొక విశేషము :** గ్రంథమంతా అనువాదమే అయినా స్వేచ్ఛగా సాగిపోతుందనడానికి కారణం వ్యాసమహర్షి నన్నయలోని దృష్టిభేదం. వ్యాసునిది పౌరాణిక దృష్టి, నన్నయది కావ్యదృష్టి. ఈ దృష్టి భేదమే నన్నయ భారతం స్వతంత్ర కావ్యంలాగా సాగిపోవటానికి హేతువైంది.

**రసపోషణ :** భారతం బహు విస్తృతమైన ఇతివృత్తం కలది. రకరకాలైన అభ్యాసములున్నాయి. అవి నానా రసాశ్రయాలు కనుక నన్నయ ఆయా సన్నివేశాలను నిశితంగా పరిశీలించి తదనుగుణంగా రసావిష్కరణ చేశాడు. ఆయా సందర్భాలలో నన్నయ ప్రదర్శించే భావనిగ్రహం చాల ప్రశంసార్హమైనది.

ఉదా॥ సభాపర్వంలో ‘ ద్రౌపది వస్త్రాపహరణ సందర్భంలో భీముని కోపాన్ని కేవలం రెండు పద్యాలలో రాశాడు నన్నయ.

1. “మదోద్ధరుడై ద్రౌపదినిట్లు’’... 2. ఇద్దురాత్ముదుర్వారమదీయ’’.. అన్న రెండు పద్యాలలో భీముని కోపాన్నంతటినీ ప్రదర్శించాడు. ఇలాంటి రసవత్తర సన్నివేశాలు కోకొల్లాలు.

**పాత్రచిత్రణ :** నన్నయ భట్టు పాత్రలను ప్రవేశపెట్టేటప్పుడు వారి లక్షణాలను, గుణ గణాలను, తెలిపే విశేషణాలను వాడతాడని తెలుస్తుంది. ఉదా॥ ‘‘విదురుని జన్మవృత్తాంతంలో’’ సంభవిల్లె విదురుడనగా ధర్మవిదురుడు అని స్వభావాన్ని వివరించాడు.

**పదప్రయోగకుశలత :** నన్నయ పదాలను సాభిప్రాయంగా వాడతాడని చెప్పవచ్చును, ఆ పదాలకు పర్యాయపదాలు వాడితే ఆ ఔచిత్యం పోతుందని చెప్పాడు. ఉదా॥ పాండవులు ద్రౌపదిని తెచ్చి తల్లికి నివేదించు సందర్భంలో ‘‘ఆలలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండు భూపాలితనూజ పంచకము పంచశరా హుతిబొందె’’.... అని రాశాడు. ఇక్కడ ‘‘పంచశరాహుతి’’ అన్న పదాన్ని మార్చి ‘‘మన్మథబాధ’’ వంటి మరేదైన పదం ఉంచితే ఔచిత్యం పోతుందని, అట్లాగే ‘‘వేదవ్యాసుడు ధర్మజుని గురించి ద్రుపదునితో చెప్పె సందర్భంలో ‘‘ధర్మతత్త్వజ్ఞుడీ ధర్మతనూజుండు, ధర్మమార్గంబేల తప్పబలుకు...’’ అని అనడంలో, ఇందులో, ధర్మతనూజుడు, అన్న పదాన్ని మాలిస్తే దాని ఔచిత్యం పోతుందని తెలియజేశాడు.

**భాష** : నన్నయ, శబ్దశాసనుడు, వాటిమీద ఆయనకు గల అధికారం అనంతం, అది సంస్కృతాంధ్రముల సమ్మిశ్రణం దానిని విశ్వనాథవారు చక్కగా అభివర్ణించారు. ''నన్నయగారి భాషలోనిది తెలుగు ఇది సంస్కృతమని లేదు. ఆది అంతయు నాంధ్రభాష అట్టి నన్నయగారి భాషలో ఈ తెలుగు శబ్దమిట్లు వాడబడింది. ఈ సంస్కృత శబ్దమిట్లు చెప్పబడింది అని యనుట అఖండ గోదావరి నదుల నీళ్లలో ఇవి ''శబరి నీళ్లు'' ఇవి కిన్నెరసాని నీళ్ళు అని చూపించినట్లు ఉండును'' అని ఇది యథార్థం.

**పద్యశైలి** : నన్నయ గురుపద్య విద్య కాద్యుడు. ఆయన రచనలో ధారశుద్ధి సర్వతో ముఖంగా గోచరిస్తూ ఉంటుంది. ఇతను పద్యాలు చక్కని గమన సౌందర్యంలో సాగిపోతూ ఉంటాయి. అందుకు ''మదమాతంగ తురంగకాంచ...'', "రయవిచలత్తురంగ మతరంగములన్''... వంటి పద్యాలను ఎన్నింటినైనా ఇతను శైలికి నిదర్శనంగా చూపవచ్చును.

ఈ విధంగా ఇతివృత్త నిర్వహణ, శయ్యా సౌభాగ్యం, ఉపదేశం, రసనిర్వహణ, పాత్రచిత్రణ, పదచిత్యం, చక్కనిభాష, గంగా ప్రవాహం వంటి పద్యరచన వంటి ఉదాత్తకావ్య లక్షణాలతో భారత రచనకు పూనుకొన్న నన్నయ, తరువాతి కవులకు మార్గనిర్దేశకుడైనాడనటం అతిశయోక్తికాదు.

**ముగింపు** : లభించిన ఆంధ్రగ్రంథములలో మొదటిది. తెలుగులో అది ఆదికావ్యము, నన్నయకీర్తికి నాటి నుంచి నేటి వరకూ, లాక్షణికుల చేతనూ, కవుల చేతను పరమ ప్రామాణికముగా పరిగణింపబడుతున్న గ్రంథం. అంతేకాదు ఒక మహాకావ్య నిర్మాణానికి కేవలం కథాకథన చాతుర్యం మాత్రమే ఉంటే చాలదు. అందుకు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసములు కావాలి. పద్యశిల్ప రహస్యం తెలియాలి. వృత్తౌచిత్యం తెలియాలి. రసపోషణ చాతుర్యం ఉండాలి. పాత్రచిత్రణలో నేర్పు ఉండాలి. లోకజ్ఞత ఉండాలి. ఇన్ని ఉంటేనే అది మహాకావ్య నిర్మాణ శక్తి అనిపించుకుంటుంది. ఆ లక్షణాలన్నీ కలిసి మూర్తీభవించిన రూపమే నన్నయ.

**ఆధారా గ్రంథాలు**


1. తెలుగు సాహిత్య చరిత్ర
2. ఆంధ్ర కావ్యాలు - ఆణిముత్యాలు
3. తెలుగు సాహితీ మంజీర డిగ్రీ ప్రథమ సంవత్సరం
4. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు
5. వచన మహాభారతం.
6. సమగ్ర తెలుగు భాషా సాహిత్య సంగ్రహము